


# విప్లవ విప్లవం



**వి. నాగచంద్రావతి**

ఆ ఇంటి గుమ్మానికి మామిడాకు తోరణం వేలాడుతోంది. ముందుహాల్లో మధ్యాహ్నం భోజనాలు చేసి భుక్తాయాసంతో సాగిలపడినవాళ్ళూ, కునుకుతీస్తూనో లేక పిచ్చాపాటీగా ముచ్చటించుకుంటున్న మగవారితో నిండుగా వున్నా కొంచెం మందకొడిగా వుంది.

హాలుకి ఆనుకొని ఉన్న పడగ్గది మాత్రం ఇందుకుభిన్నంగా గొప్ప కోలాహలంగా వుంది.

పువ్వులు, నగలూ, చీరలూ, నవ్వులు, హాస్యాలూ-వీటన్నిటి మధ్యన మూడురోజుల క్రితమే పెళ్లయిన విప్లవా—

★ ★ ★

ముగ్ధలా ముకుళించుకుని విడీవిడకుండా వున్న మల్లెమొగ్గల్ని దోసిలినిండుగా తీసుకుని గాఢంగా ఆఘ్రాణించింది విప్లవ.

తనువంతా వ్యాపించిన పరిమళ ఆస్వాదనతో కనులు అరమోడ్పులయ్యేయి.

"ఆ-ఆ...మల్లెల సౌరభాన్నంతా ఇప్పుడే పీల్చెయ్యకే అమ్మడూ! రాత్రి అతగాడికి కొద్దిగా అట్టిపెట్టు" పూలమాలలతో మంచాన్నలంకరిస్తోన్న రత్న అత్తకూతుర్ని మేలమాడింది.

చేమంతి పూవన్నెలో ఉన్న విప్లవ చెంపలు క్షణంలో ఎర్ర కలువలయ్యేయి.

"అదికాదులేవే-ఆ సువాసనంతా పీల్చుకుని తనే గుబాళించిపోతే అతగాణ్ణి చేరుకోవాలని దాని తాపత్రయం" దీర్ఘంతీస్తూ పరిహాసమాడిందింకో వరసైన జాణ.

"పసిదాన్ని చేసి ఆడిస్తున్నారా-ఊరుకోండ్రా-బెదిరిపోగలదూ" అనివాళ్లని గదిమి," అమ్మా విప్లవా-వాలుజడకి-మల్లెపూవులు కుట్టనా మొగలిరేకులు కుట్టనా? మల్లెపూల జడలు విసిరితివో మగడు మైమరిచిపోతాడు- మొగలిరేకు జడవేసి కొడితివో మాటజవదాటక నడుచుకుంటాడు. నీ ఇష్టం మరి" అని గడుసుగా కొంటెతనం చూపించిందో ప్రౌఢ.

కిలకిలలతో, పకపకలతో ఆగదికే గిలిగింతలు పెట్టినట్టుగా అయింది కొన్నిక్షణాలు.

సిగ్గుల మొగ్గయి రెప్పలు వాల్చింది విప్లవ. ఆ వాల్చిన రెప్పల వెనుక మధురోహలెన్నెన్నో.

★ ★ ★

ఇక పడమటి గదిలో కొత్తపెళ్లికొడుకు రామచంద్రావు ఒక్కడూను.

పడక కుర్చీలో వాలి కళ్లుమూసుకున్నాడుగానీ అతగాడు నిద్రపోవట్లేదు.

వివాహం అట్టహాసంగా చేసేరు-బాగానే వుందిగానీ పునస్సంధానానికి గూడా ఈ హడావిడీ, చుట్టాలూ, వేళకోళాలూ, పీటలమీద కూర్చోవటాలూ, ఫలప్రదానాలు ఇవేవీ నచ్చటంలేదతనికి.

పైగా-పెళ్లికి వచ్చిన ఫ్రెండ్సందరూ వెళ్లిపోవటం మూలాన ఏంతోచకుండా కూడావుంది.

వదినలు పరిహాసాలాడ్డం మితిమీరినట్టుగా వుండి చిరాగ్గా వుంది. బావమరుదుల అల్లరీ, మరదళ్ల సరసమూ కలిసి తనకి తాటాకులు కడుతున్నట్టనిపించి రోషంగా వుంది. ఇంజనీర్లయిన పెద్దబావమరుదులిద్దరూ తన ఆధిక్యాన్ని గుర్తించకుండా పోజుకొడుతున్నారేమోనని అనుమానంగా వుంది.

తానిష్టపడని ఈ అంశాలన్నింటినీ రాత్రి శోభనం గదిలోకి వెళ్లగానే, తలుపుమూయగానే, తనకందించిన పాలు తాగకుండానే నిర్మొహమాటంగా, ఆ గదిలో కొచ్చిన అమ్మాయిని ఎక్స్‌ప్లనేషన్ అడిగెయ్యదలుచుకొన్నాడతను.

అందుగ్గానూ రాత్రిగదిలోకి వెళ్లగానే తన ఆరపణలు ఎలా ప్రారంభించాలో, దేని తరువాత ఏది వరుసక్రమంలో వుండాలో, బదులుగా ఆ అమ్మాయి సమాధానమో సమర్ధనో-ఏవిధంగా వుండవచ్చునో, వెంటనే తనుదానిని ఎలా ఖండించాలో అన్నీ కళ్లుమూసుకొనే రిహార్సల్సు వేసుకుంటున్నాడతను.

"బావా నీకు ఉత్తరం"

కళ్లుతెరిచాడు రామచంద్రావు, 'తనకి ఇక్కడకుఉత్తరం రాసేదెవరబ్బా' అనుకుంటూ బావమరిది చేతినుంచి ఆ ఇన్‌లాండ్ లెటర్‌ని అందుకున్నాడు. 'ఈ భడవగానీ ఈ వంకని ట్రిక్ ఏదన్నా నామీద 'ప్లే' చేయటం లేదుకదా:' అనే సందేహంతో సంకోచిస్తోనే తెరిచిచూశాడు.

మొదట చివర సంతకాన్ని యధాలాపంగా చూస్తూ తుళ్లిపడ్డాడు రామచంద్రావు. 'ఎవరదీ-ఆకాశరామన్న-?'

ఇక చూపులు వాటంతట అవే అక్షరాల వెంట పరుగులుపెట్టాయి హడావిడిగా.

'అయ్యా-పెళ్లికుమారుడుగారూ! నా అంచన ప్రకారం ఈ రోజే తమరి శోభన ముహూర్తం అయ్యుండాలి.

విప్లవ మీకోసమే పవిత్రంగా వికసించిన కుసుమమనీ, ఆపూవులోని మకరందాన్ని తొలిసారిగా గ్రోలే మధుపం మీరేననీ భ్రమపడుతున్నారు కదూ? ఆపుణ్యకాలం కోసం వేగిరపడుతూ కలలు కంటున్నారేమో కూడా.

పాపం-మీకు నా సానుభూతి.

విప్లవ మీకు భార్యకాకముందే నాకు ప్రియురాలు. ఆమె మనసూ తనువూ కూడా నావయ్యాకే నీవవుతున్నాయి.

మైండిట్-ఆకాశరామన్న.

బుర్ర తిరిగిపోయింది రామచంద్రావుకి. ఆతరవాత కోపమూ ఉక్రోషమూ ముంచుకొచ్చేయి.

'ఏమిటేమిటీ -సంగనాచిలా మొహమూ అదీ నీ-దాని వెనకాల ఇంత కథుందా? ఎర్రగా బుర్రగా వుందని మురిసిపోయేనే కానీ ఇంత గ్రంథసాంగురాలనుకోలేదుస్మీ!

హు! ఎంగిలికూటికి కక్కుర్తిపడే ఖర్మేమిటి తనకి!

అనలు ఇంతమోనం చేసి కుక్కముట్టిన కుండని తమకి అంటగడ్తారా వాళ్లు. ఇప్పుడే అమీతుమీ తేల్చేస్తాను!' ఆవేశపడిపోయాడు రామచంద్రావు.

"అమ్మా!" సింహనాదంచేశాడు రామచంద్రావు.

కోడలికి పెట్టే సారెగురించి వియ్యపురాలితో చర్చిస్తోన్న సావిత్రమ్మ కొడుకు గర్జన విని, 'మళ్లీ ఏపుట్టి మునిగింది?" అనుకుంది.

